క్లుప్తంగా

రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు



కలెక్టర్ అరుణ్‌బాబుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

పుట్టపర్తి అర్బన్: రాఖీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం కలెక్టర్ అరుణ్‌బాబుకు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి ఆశీర్వదించారు. అలాగే కలెక్టరేట్‌లోని ఉద్యోగులు, వచ్చిన అధికారులకు రాఖీలు కట్టి, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. నుదుటిన తిలకం దిద్ది స్వీట్లు అందజేశారు. ప్రతి సంవత్సరం వందలాది మంది ఉద్యోగులు, మిత్రులు, సత్యసాయి భక్తులకు రాఖీలు కట్టడం ఆనవాయితీ అని లక్ష్మి, గోపి తదితరులు పేర్కొన్నారు.

కార్యదర్శికి మెమో జారీ

తనకల్లు: మండల పరిధిలోని బాలసముద్రం గ్రామ సచివాలయంలో పని చేస్తున్న కార్యదర్శికి మెమో జారీ చేసినట్లు ఎంపీడీఓ పూల నరసింహులు శుక్రవారం తెలిపారు. కార్యదర్శి రాజశేఖర్ నాయక్ రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పాటు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించలేదన్నారు. అందుకే మెమో అందజేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెద్దమ్మ దేవతకు పూజలు



వేపాకుల అలంకరణలో సాలేవీధి పెద్దమ్మ తల్లి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాలేవీధిలో వెలసిన పెద్దమ్మ తల్లికి శ్రావణ శుక్రవారం సందర్భంగా బుగ్గా వంశస్థులు అమ్మవారిని వేపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు వెంకటేష్‌శర్మ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని పూజలు చేపట్టారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సౌజన్యకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు అందరూ తప్పక హాజరు కావాలన్నారు. అలాగే మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు



పూల అలంకరణలో రాఘవేంద్ర స్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న రాఘవేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం 352వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయంలో స్వామికి మధ్య ఆరాధన కార్యక్రమాలను అర్చకులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించారు. ప్రత్యేక పూలతో స్వామిని అలంకరించారు. సాయంత్రం నాట్యాచార్యుడు బాబు బాలాజీ శిష్య బృందం చేసిన నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ పూజల్లో మఠం మేనేజర్ రమేష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుతో మేలు



సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులతో వేరుశనగ సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుతో ఊరట కలుగుతుందని మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ గద్దె పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఏఓ రమాదేవి అధ్యక్షతన సబ్సిడీపై ఉలవలు, అలసంద, పెసర తదితర విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తోందన్నారు. ఏఓ రమాదేవి మాట్లాడుతూ.. వేరుశనగ సాగు చేయని రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవలు 10 కిలోల పూర్తి ధర రూ.1,080 కాగా సబ్సిడీ రూ.864 పోనూ రూ.216 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే 4 కిలోల పెసర పూర్తి ధర రూ.470 కాగా సబ్సిడీ రూ.376 పోనూ రూ.94 చెల్లించాలన్నారు. 8 కిలోల అలసందలు బ్యాగు పూర్తి ధర రూ.920 కాగా సబ్సిడీ రూ.736 పోనూ రైతులు రూ.184 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ విజయకుమార్, హెచ్‌ఏఏ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో సత్వర సేవలు

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

ఎన్‌పీకుంట: సచివాలయ వ్యవస్థతో గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ పరిపాలన మరింత చేరువైందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రూ.40 లక్షల ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సచివాలయ నూతన భవనాన్ని నాయకులు, అధికారుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పూజలు నిర్వహించిన అనంతరం సచివాలయంలో నిర్మించిన వివిధ గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల ద్వారా 34 శాఖలకు సంబంధించిన 500 లకు పైగా సేవలు అందుతాయని తెలిపారు. ప్రజలకు ఎప్పుడు ఎలాంటి సమస్య ఎదురైనా నేరుగా గ్రామ సచివాలయం నుంచే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గత టీడీపీ పాలనలో అర్హులైనప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలంటే అధికారులు, నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగడమే కాకుండా లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. సమస్యలపై అర్జీలు ఇచ్చినా అవి చెత్తకుప్పల్లో వేసేవారని గుర్తు చేశారు. ప్రజలకు పారదర్శకంగా పథకాలు అందించేందుకు సీఎం జగన్ సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసి సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉండాలని కోరారు. అనంతరం సచివాలయ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసిన నిర్మాణ సహాయకుడు వాసుదేవరెడ్డిని సత్కరించారు. అలాగే సర్పంచ్ అంజినమ్మ, ఎంపీడీఓ, సచివాలయ సిబ్బంది ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సత్కరించారు.

హిందూ శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

మండల కేంద్రంలో హిందువుల శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వ భూమిని గుర్తించి ఇవ్వాలని కోరారు. మండల కేంద్రానికి సమీపంలోని పెద్దచెరువు వద్ద ఉన్న సుమారు 4 ఎకరాల ప్రభుత్వ భూమి శ్మశానవాటికకు అనువుగా ఉంటుందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే.. ప్రభుత్వ భూమిని గుర్తించి నివేదిక సిద్ధం చేయాలని వీఆర్‌ఓకు సూచించారు. అలాగే మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌కు వెళ్లే దారిలో అక్రమ కట్టడాలు చేపట్టారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే బాధ్యులకు నోటీసులు జారీ చేసి అక్రమ కట్టడాలను తొలగించాలని పంచాయితీ కార్యదర్శి, సర్పంచ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటె రాము, సర్పంచ్ అంజినమ్మ, ఎంపీటీసీలు తిమ్మారెడ్డి, కొత్తరంగారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ సుబహాన్, పార్టీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి, ఉపసర్పంచులు ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి, వాటర్‌షెడ్ చైర్మెన్లు బయారెడ్డి, ఓబుళరెడ్డి, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, మాజీమార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవయ్య, ఎంపీడీఓ ఆదినారాయణ, మైనారిటీ నాయకులు షామీర్‌బాషా, తిరుమల నాయుడు, శ్రీరాములు, వెంకటరామిరెడ్డి, మాధవరెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం



వైఎస్సార్‌సీపీ నాయకురాలు బొజ్జమ్మను సన్మానించిన దృశ్యం

కదిరి: టీడీపీని వీడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కర్నూలు జిల్లా కపట్రాల బొజ్జమ్మ దంపతులను శుక్రవారం కదిరి ఆర్‌అండ్‌బీ బంగ్లాలో పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బొజ్జమ్మ దంపతులు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని తెలిపారు. సీఎం జగనన్న పేదల పక్షాన నిలబడితే.. చంద్రబాబు పెత్తందార్ల పక్షాన నిలిచారని పేర్కొన్నారు. బీసీల పక్షపాతి అని చంద్రబాబు చెప్పడమే కానీ బీసీలకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. తమను జగనన్న సొంత అన్నయ్యలా ఆదరించారని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కొన్నెర కళ్యాణ్, దాదాపీర్, పాల ఏకిరి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

121 కొత్త పింఛన్ల మంజూరు



నల్లమాడ: పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ సునీతాబాయి

నల్లమాడ: మండలానికి నూతనంగా 121 పింఛన్లు మంజూరైనట్లు మండల పరిషత్ కార్యాలయ అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. నల్లమాడ గ్రామ పంచాయితీకి 35, చారుపల్లికి 6, దొన్నికోటకు 13, కురుమాలకు 9, మసకవంకపల్లికి 14, పాతబత్తలపల్లికి 11, రెడ్డిపల్లికి 6, వంకరకుంటకు 10, వేళ్లమద్దికి 4, యర్రవంకపల్లి పంచాయతీకి 13 చొప్పున వచ్చాయన్నారు. నల్లమాడ-1 సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దుంగావత్ సునీతా బాయి ముఖ్య అతిథిగా హాజరై పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, నాయకుడు షంషీర్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై ఆరా..

ధర్మవరం అర్బన్: పట్టణంలో నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వార్డుల్లో తిరుగుతూ పింఛన్ల పంపిణీ సజావుగా చేపట్టాలని వలంటీర్లకు సూచించారు. 29వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ కోటిరెడ్డి బాలిరెడ్డి పలువురికి పింఛన్లను అందజేశారు.

బత్తలపల్లి: మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రానికి 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. వలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు.

కౌలు రైతులకు 'వైఎస్సార్ రైతు భరోసా'

బత్తలపల్లి: రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపడుతోంది. సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు పంటల సాగుకు ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో కౌలు రైతు దిశ, దశ మారుతోంది. గతంలో భూ యజమాని అనుమతిస్తే తప్పా వీరికి ఎలాంటి రాయితీలు వచ్చేవి కావు. అంతేకాకుండా వారు పండించిన పంటలను కూడా కొనుగోలు కేంద్రాల్లో నేరుగా విక్రయించుకోలేని పరిస్థితి ఉండేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కౌలు రైతులను ఆదుకుంటోంది. భూ యజమాని హక్కులకు ఎలాంటి భంగం కలిగించకుండా పంట సాగు చేస్తున్న కౌలు రైతులకు అన్ని రాయితీలు వర్తించేలా పంట సాగు హక్కు పత్రాలను (సీసీఆర్‌సీ) అందజేస్తోంది. దీంతో వ్యవసాయశాఖ ద్వారా వచ్చే రాయితీలు వారు నేరుగా పొందుతున్నారు. మండలంలో అర్హులైన 12 మంది కౌలు రైతుల ఖాతాల్లో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ.13,500 చొప్పున నగదు జమ చేసినట్లు ఏఓ ఓబిరెడ్డి తెలిపారు. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వమే కౌలు రైతులకు చెల్లించడం జరుగుతుందన్నారు.

రూ.2,47,475 రికవరీకి ఆదేశం



ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా 2022 ఏప్రిల్ నుంచి ఆగస్టు 2023 వరకూ 14 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్ శాఖ కింద చేపట్టిన పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా చేసిన ఉపాధి పనుల వివరాలను డీఆర్‌పీలు సభలో చదివి వినిపించారు. ఉపాధిహామీ పనుల్లో అత్యధికంగా కొండపై ఖండిత కందకాలు (సాగర్ ట్రెంచ్) పనులు చేపట్టడంపై డ్వామా పీడీ రామాంజినేయులు ఉపాధిహామీ ఏపీఓ, సాంకేతిక సహాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన పనుల్లో కొలతల్లో తేడాలు రావడం వల్ల కూలీలు నష్టపోతున్నారని జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి మండిపడ్డారు. మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీల నుంచి మొత్తం రూ.2,47,475 రికవరీ చేయాలని ఆదేశించారు. పనుల కొలతల్లో నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కనపడుతోందన్నారు. ఇక నుంచి సాగర్‌ట్రెంచ్ పనులు కొనసాగించరాదన్నారు. పురోగతిలో ఉన్న పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయించాలని సూచించారు. సమావేశంలో ఏపీడీ శివశంకర్, సహాయ విజిలెన్స్ అధికారి రాజ్‌కుమార్, ఎస్‌ఆర్పీ కాంతయ్య, ఎంపీడీఓ రామానాయక్, సర్పంచ్ రహంతుల్లా, ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీ సోమశేఖరరెడ్డి సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీంద్రనాయక్, ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి, పలువురు సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ



తనకల్లు: గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్ విగ్రహాన్ని ముస్తాబు చేసిన దృశ్యం

తనకల్లు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయం వద్ద శనివారం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కడపల మోహన్‌రెడ్డి విశిష్ట అతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకటరమణ, పార్టీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్, యువనేత వాల్మీకి పవన్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నారు. అలాగే డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా కొత్త గ్రామ సచివాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి స్థానిక సంస్థల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి కోరారు.

కదిరి అర్బన్: మండల పరిధిలోని వీరేపల్లిపేటలో శనివారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి హాజరవుతారన్నారు.

నల్లచెరువు: డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తామని ఎంపీపీ రమణారెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, సర్పంచ్ పంచరత్నమ్మ, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు.

దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి

ప్రశాంతి నిలయం: దోమల నివారణకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో శుక్రవారం ఆయన సిబ్బందితో కలసి పర్యటించారు. పరిసరాల శుభ్రతపై సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. అపరిశుభ్రత నెలకొన్న ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం కచ్చితంగా డ్రైడే పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇళ్లలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచకూడదన్నారు. స్వచ్ఛమైన నీటిని వేడి చేసి చల్లార్చుకుని తాగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కేసీ కుళ్లాయప్ప నాయక్, అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యుడు డాక్టర్ ఫణీంద్ర, సాయి, ఏఎంఓ లక్ష్మీనాయక్, ఎస్‌యూఓ రమణయ్య, హెల్త్ సెక్రెటరీలు పరిమళ, సుహాసిని, అడ్మిన్ సెక్రెటరీ సాయిమోహన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి



మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: మండల పరిధిలోని పెడపల్లి, సుబ్బరాయనిపల్లి గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది పర్యటించారు. ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌పై అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని తెలిపారు. మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్‌ఎన్ లలిత కుమారి, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీ రాధ, సుస్మిత, ప్రమీళ, శివ, రాజశేఖర్, జ్యోతి, శ్రీదేవి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కదిరి టౌన్: కుటాగుళ్లలోని తారకరామ్ నగర్ సమీపంలోని ఖాళీ స్థలంలో నిర్వహిస్తున్న జూదం స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా జూదం ఆడుతున్న కుటాగుళ్లకు చెందిన చెరువు శ్రీనివాసులు, భాను ప్రసాద్, పిట్ల ఆంజనేయులు, చింత మధు, మోపూరి జయరాం, వెంగమ్ శివ, జోల వెంకటరమణ, మక్తాపురం కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. 8 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.9,150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ మధు తెలిపారు. వీరిని రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

కారును ఢీకొన్న ఐచర్

ముదిగుబ్బ: మండల కేంద్రం సమీపంలోని ఆర్‌ఎస్ కళ్యాణ మండపం వద్ద శుక్రవారం రాత్రి ఓ కారును ఐచర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అనంతపురానికి చెందిన బబాజన్, లింగప్ప గాయపడ్డారు. వీరు తిరుపతికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

4న వైస్ ఎంపీపీ-2 ఎన్నిక

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ ఉపాధ్యక్షుడు -2 ఎన్నిక ఈనెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రొసైడింగ్ అధికారి గోపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు తప్పక హాజరు కావాలని సూచించారు.

వికలాంగుడికి ఆపన్నహస్తం



కిరాణా దుకాణం ఏర్పాటు చేయించిన వార్డు ఇన్‌చార్జ్ దోలా రాజారెడ్డి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని 27వ వార్డు కౌన్సిలర్ దోలా ఓబుళమ్మ, వార్డు ఇన్‌చార్జ్ దోలా రాజారెడ్డి వార్డులోని ఓ వికలాంగుడికి అండగా నిలిచారు. శుక్రవారం రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆ నగదుతో కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. వికలాంగుడు జీవన ఆధారం కోసం కిరాణా షాపు పెట్టించానని ఆయన తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

బత్తలపల్లి: ఉపాధి పథకంలో 2018 నుంచి 2023 సంవత్సరాల కాలంలో ఏదో ఒక సంవత్సరం వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్ రాజు, జాబ్స్ కో–ఆర్డినేటర్ అనంతలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ పాస్ లేదా ఏదైనా డిగ్రీ పట్టా పొంది 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాలు వయస్సు కలిగిన ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులని వెల్లడించారు. ఈనెల 5వ తేదీలోపు బత్తలపల్లి భారతి మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 7702100238, 9182316114 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

రామగిరి: ఉపాధి హామీ కూలీ కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు వైకేపీ ఏపీఎం ఓబులేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీలోపు ముత్యాలమ్మ మండల సమాఖ్యలో బయోడేటా ఇవ్వాలని సూచించారు. వివరాలకు 7702100238, 9182316114 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మా బకాయి చెల్లించండి

రామగిరి: తమ బకాయి చెల్లించిన తర్వాతే పరిశ్రమలోని పాత ఇనుమ సామగ్రి తరలించాలని బీజీఎంఎల్ (భారత్ గోల్డ్‌మైన్స్ లిమిటెడ్) కార్మికులు అన్నారు. శుక్రవారం వారు రామగిరిలోని పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. బంగారు గనులకు సంబంధించిన పాత వాహనాలు, ఇనుప సామగ్రి విక్రయానికి టెండర్ నిర్వహించగా, ముంబైకి చెందిన కంపెనీ దక్కించుకుందన్నారు. ఆ కంపెనీ కేజీఎఫ్‌కు సబ్ కాంట్రాక్టర్ ఇవ్వడంతో వారు ఈనెల 4వ తేదీన బీజీఎంఎల్‌లోని సామగ్రి తీసుకువెళ్లేందుకు వస్తున్నారన్నారు. బకాయి చెల్లించకుండా సామగ్రి తరలించడం అన్యాయమన్నారు.

మేమూ సహకరిస్తాం..

బంగారు గనుల్లో 180 మంది కార్మికులు అప్పట్లో చేసేవారమని, 2001లో బంగారు గనులు మూతపడగా తమ కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటికే కంపెనీ తమకు రూ.3 లక్షలు చొప్పున బకాయిలు పడిందన్నారు. ఈ విషయంపై అప్పట్లో తామంతా బెంగళూరు హైకోర్టును ఆశ్రయించగా, కార్మికుల బకాయిలు చెల్లించిన తర్వాతే రామగిరి బంగారు గనులను తెరిచేందుకు సన్నద్ధం కావాలని కోర్టు 2012లో తీర్పు చెప్పిందన్నారు. సీఎం జగన్, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో బీజీఎంఎల్ తెరిపించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. బకాయిలు చెల్లిస్తే గోల్డ్‌మైన్స్ తెరిపించేందుకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు షాబ్‌జాన్, నారాయణ, పోతన్న, నాగరాజు, అంజనేయులు, ముత్యాలప్ప పాల్గొన్నారు.

పానీపూరి బండిని ఢీకొన్న కారు



చికిత్స పొందుతున్న ఆదినారాయణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివానగర్‌లో పానీపూరి బండిని కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శివానగర్‌కు చెందిన ఆదినారాయణ పానీపూరి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తన ఇంటి ముందు పానీపూరి బండిని సరుకులతో సిద్ధం చేసుకుంటండగా.. టౌన్‌లోకి వచ్చే కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆదినారాయణకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడ్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు

తాడిమర్రి: తాడిమర్రి, పెద్దకోట్ల, నార్శింపల్లి, ఎం.అగ్రహారం, కునుకుంట్ల, దాడితోట, చిల్లవారిపల్లి, పిన్నదరి, చిన్నచిగుళ్లరేవు తదితర గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టారు. డ్రైడే–ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా అపరిశుభ్రత నెలకొన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే మురుగునీటి గుంతలను గుర్తించి వేస్టాయిల్ ఉండలు వేయించారు. అనంతరం ఇంటింటికీ నీటి తొట్టెలను శుభ్రం చేయించారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం: ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులకు దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం దాతల సహకారంతో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రశాంతి, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోటి లక్ష్మీ వెంకటేశ్వర్లు, సభ్యులు రామకృష్ణ, రూపారాజా, పల్లెం వేణుగోపాల్, సోమశేఖర్ ప్రసాద్, దేవతా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

కొత్తచెరువు: మండల పరిధిలోని వంగంపల్లి, ఇరగంపల్లి గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం ఖిద్మత్ ఎఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు షామీర్ విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ మేరకు తన తండ్రి అల్లాబకాష్ చేతుల మీదుగా విద్యార్థులకు పలకలు, నోటుపుస్తకాలు, పెన్సిల్, పెన్నులను అందించారు. ప్రధానోపాధ్యాయుడు గోపి, ఈశ్వరయ్య, ఫరీద్, అల్లు, యశ్వంత్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి

చెన్నేకొత్తపల్లి: అర్హులందరికీ పింఛన్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా పింఛన్ మంజూరైన వారికి పింఛన్ మొత్తం అందజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి

ధర్మవరం: పట్టణంలోని 3వ వార్డు పరిధిలో 30 అడుగుల రోడ్డు నిర్మాణానికి శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామి రెడ్డి, 3వ వార్డు కౌన్సిలర్ శంకర్‌తేజ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.